క్లుప్తంగా

వీల్‌చైర్ అందజేత



డోర్నకల్: డోర్నకల్‌కు చెందిన ఓ దివ్యాంగుడికి హోప్ స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేశారు. స్థానిక యాదవనగర్‌కు చెందిన 22 సంవత్సరాల దివ్యాంగ యువకుడు కొత్త ప్రకాష్‌కు హోప్ స్టెప్స్ ఫౌండేషన్ సమకూర్చిన వీల్‌చైర్‌ను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.ఉపేందర్‌రావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఏఎస్సై కోటేశ్వర్‌రావు, ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, సభ్యులు దాసరి రాజేష్, ఎల్లావుల భునేష్, బడేటి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్: మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఏవీ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా సంఘం అధ్యక్షుడిగా పెద్ది సైదులు, ఉపాధ్యక్షుడిగా పెద్ది రాజయ్య, కార్యదర్శిగా నాయిని చేరాలు, కార్యవర్గ సభ్యులుగా వాడపెల్లి శ్రీనివాస, కసుపు విష్ణువర్ధన్, పెద్ది ఓం వంశీకృష్ణ, పెద్ది తరుణ్, బసవబోయిన వంశీ, పెద్ది జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుత్ తీగలను సరి చేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'తెగిపడిన విద్యుత్ తీగలు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మండలంలోని రాజ్యాతండాలో గాలి దుమారానికి విద్యుత్ లైన్ తీగలు తెగిపడటంతో విద్యుత్ ఏఈ మహేంద్రబాబు విద్యుత్ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో విద్యుత్ తీగలను పైగి లాగించి గ్రామస్తుల సమస్యను పరిష్కరించారు.

మానవత్వం చాటుకున్న హెడ్‌కానిస్టేబుల్



నర్సింహులపేట: గ్రామంలో పొలం వద్ద చిన్న గొడవలో గాయపడి న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితుడి కాలుకు రక్తస్రావం అవుతుండగా హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కట్టు కట్టి ప్రథమ చికిత్స చేశాడు. హ్యాట్సాఫ్ పోలీసన్న అంటు సోషల్ మీడియాలో సోమవారం వైరల్ అయింది. మండలంలోని వస్రాం తండాకు చెందిన జాటోత్ పూల్‌సింగ్ తన పొలం వద్ద హద్దు విషయంలో ఇదే తండాకు చెందిన లూనావత్ సూర్యతో గొడవ జరగడంతో కాలుకు గాయమైంది. ఫిర్యాదు చేయడానికి పీఎస్‌కు వచ్చాడు. కాలికి గాయమై రక్తం కారుతుండగా బాధితుడికి హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ చికిత్స చేసి ఫిర్యాదును తీసుకొని, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించాడు. ఎస్సై సతీష్, సిబ్బంది ఆయనను అభినందించారు.

మార్కెట్ వైస్ చైర్మన్‌గా నరేశ్‌రెడ్డి



గూడూరు: నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మండలంలోని సీతానగరం శివారు రెడ్డిపల్లికు చెందిన ఎడ్ల నరేశ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ఆదివారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌లుగా బ్రాహ్మణపల్లికి చెందిన సమ్మెట శ్రీనివాస్‌గౌడ్, గుండెంగకు చెందిన కందిక సుమలతను నియమించారు.

దేశ రక్షణలో జవాన్ల పాత్ర కీలకం



తొర్రూరు రూరల్: భారతదేశాన్ని కంటికిరెప్పలాగా కాపాడడం, రక్షించడంలో ఆర్మీ జవాన్ల పాత్ర ఎంతో కీలకమని ఎంపీటీసీ ముద్దం విక్రంరెడ్డి, మాజీ సర్పంచ్ కడెం యాకయ్య అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆర్మీ ఉద్యోగాన్ని సాధించిన కిన్నెర నరేందర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిన్నెర యాదగిరి, తీగల కృష్ణారెడ్డి, ముద్దం వీరారెడ్డి, తులసిరామ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీరాములు, రాందాస్, రమేష్, చార్ల శంకరి, శివాజీ పాల్గొన్నారు.

బక్రీద్ వేడుకలు

నెల్లికుదురు: మండల కేంద్రంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గార్ల: ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



డోర్నకల్‌లో..



జిల్లా వ్యాప్తంగా సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మరిపెడలో..



బయ్యారం: బక్రీద్ వేడుకలో పాల్గొన్న ముస్లింలు



కురవి: తట్టుపల్లిలో..



నర్సింహులపేట: అలయ్‌బలయ్ చేసుకుంటున్న చిన్నారులు



గూడూరు: ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

భూములను దళితులకు అప్పగించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామ రెవెన్యూ పరిధిలో ధామ్యతండా గ్రామ పంచాయతీ శివార్లో గల భూదాన్ భూములను తిరిగి దళితులకు అప్పగించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా పీరయ్య మాట్లాడుతూ.. 1959–60 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం భూదాన్ ద్వారా మాదిగలకు 60ఎకరాల పంపిణీ చేసిందని తెలిపారు. భూదాన్ భూములను గ్రామంలో ఉన్న ఇతర కులస్తులు ఆక్రమించుకుని సాగులోకి వచ్చారని ఆరోపించారు. నాటి నుంచి 2020 వరకు లబ్ధిదారులకు పేరుపైనే పహనీలు ఉన్నాయని, తరువాత రికార్డులను తారుమారు చేసి తెలంగాణ నూతన పట్టాలను అక్రమ ఐదారులకు రికార్డు చేశారని ఆరోపించారు. భూదాన్ భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్, ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. వారసత్వంగా మాదిగలకు చెందాల్సిన భూములను తిరిగి వారికే అప్పగించాలని, రికార్డులను తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్ మాదిగ, జిల్లా అధ్యక్షులు శాగంటి రమేష్‌మాదిగ, కందిపాటి భిక్షపతి, ఇరుగు రవి, గిగ్గిళ్ల నవీన్, విష్ణు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుగ్గిళ్ల పీరయ్య

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాంబాబు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛన్ అందించాలన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, మండల అధ్యక్షుడు కొనగొండ వెంకన్న, రాంపల్లి వెంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటిపూడి అరుణ్‌కుమార్, కేతమ్మ, మీరాసాహెబ్, సామల వీరభద్రం, కొమురయ్య, బిర్రు యుగేందర్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డుల ప్రదానం

మహబూబాబాద్ రూరల్: రోటరీ క్లబ్ మహబూబాబాద్ శాఖకు 2023–24 సంవత్సరానికి నిర్వహించిన కార్యక్రమాలకుగాను మూడు అవార్డులను ప్రదానం చేశారు. ప్రాథమిక విద్య, అక్షరాస్యత, పర్యావరణం, శాంతిస్థాపన, సంఘర్షణల నివారణ ప్రాంతాల్లో నిర్వహించిన సేవలను గుర్తించి అవార్డులను ఆదివారం భద్రాచలంలోని సీతారామ కన్వెన్షన్ హాల్లో అందజేసి అభినందించారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి ద్వారా రోటరీ క్లబ్ మహబూబాబాద్ శాఖ అధ్యక్షుడు కొడారి నాగేందర్ రావు, కార్యదర్శి గూడూరు నాగేశ్వరరావు అవార్డులను స్వీకరించారు. ఈసందర్భంగా వారిని మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలే నాగేశ్వరరావు, జిల్లా బాధ్యులు వద్దుల సురేందర్ రెడ్డి, డాక్టర్ డోలి సత్యనారాయణ, బిక్కి వెంకటేశ్వర్లు, పొక్కుల సదానందం, క్లబ్ సభ్యులు అభినందించారు.



అవార్డు స్వీకరిస్తున్న నాగేందర్‌రావు, నాగేశ్వరరావు

పొలాల్లోకి మిషన్ భగీరథ నీరు



భగీరథ నీటితో నిండిన పొలం

దంతాలపల్లి: మిషన్ భగీరథ నీటి బారినుంచి పొలాన్ని కాపాడాలని నర్సింహులపేట మండలం పనుమటిగూడెం గ్రామానికి చెందిన రైతు చిమ్ముల వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దంతాలపల్లి మండలం బీరాశెట్టిగూడెం గ్రామం దగ్గర వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పొలం పక్క నుంచి వివిధ మండలాలకు భగీరథ నీటి సరఫరా కోసం పైపులైన్ వేశారన్నారు. గత నెల 24న పైపులైనుకు డ్యామేజీ ఏర్పడి భగీరథ నీరు లీకై 7 ఎకరాల పొలంలో నీరు నిల్వ ఉంటుందన్నారు. ఈవిషయమై భగీరథ సూపర్‌వైజర్లకు పలుమార్లు తెలిపిన ఫలితం లేకపోవడంతో డీఈకి తెలుపగా ఆయన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పొలం సారవంతానికి ఇటీవలే జీలుగ విత్తనాలు వేశానని, భగీరథ నీరు నిల్వ ఉండడంతో జీలుగ మొక్కలు కుళ్లి పోతున్నాయని తెలిపాడు. గతంలో కూడా పైపు డ్యామేజీ కావడంతో ఎకరం పొలం వరకు నాటు వేయకుండా వదిలిపెట్టానన్నాడు. అధికారులు స్పందించి భగీరథ నీళ్ల బారి నుంచి పొలాన్ని కాపాడాలని కోరాడు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం

మహబూబాబాద్ రూరల్: ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నంది నగర్ దైవ స్వరూపి ప్రార్థన మందిర మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై కేక్ కట్ చేసి చర్చి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ కృపాకర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు విజయమ్మ, పోతురాజు రాజు, చుక్కల ఉదయ్ చందర్, కాట భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చర్చి ఫాదర్

జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

బయ్యారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు రామగిరి భిక్షం పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు వీరభద్రం, సంగన్న, ఐలయ్య, బుచ్చయ్య, రాకేష్, నాగేశ్వరరావు, విశ్వనాం, మహేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించి భగవద్గీతలోని అధ్యాయాలపై సభ్యులు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సభ్యులు కృష్ణవేణి, లలిత, వీరస్వామి, రజిత, సుమ, పాపక్క, సుష్మ, హేమ పాల్గొన్నారు.

అటవీశాఖ అడ్డంకులు తొలగించాలి

కొత్తగూడ: మండలంలోని అటవీ హక్కులు కలిగిన భూములకు విద్యుత్ లైన్ వేసుకునేందుకు అటవీ శాఖ అడ్డంకులు లేకుండా చూడాలని సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన విద్యుత్ వినియోగ దారుల ప్రజావాణిలో వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఈ సురేష్ సమాధానం ఇస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలి

గార్ల: నీట్ 2024 పరీక్ష ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పరామర్శ

మరిపెడ రూరల్: మండలంలోని తాళ్ల ఊకల్ గ్రామానికి చెందిన తప్పెట్ల మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపాడు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిమాదిగ, నవీన్, పార్థు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం..

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని నేరవేరుస్తామని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో వేంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఇప్పటికే చాలా వరకు నేరవేర్చామన్నారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. గ్రామాలలో గ్రామ, మండల కమిటీలతోపాటు సమన్వయ కమిటీలు కూడా అవసరమని తెలిపారు. తను అందుబాటులో లేనప్పుడు కార్యకర్తలను కాపాడే బాధ్యత గ్రామ, మండల నాయకులదే అని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టునాయక్, ఎంపీటీసీ నెమ్మది యాకయ్య, కొమ్మినేని సతీష్, నాయకులు చిన్నరాములు, హరికృష్ణ, సహకార సంఘం చైర్మన్ రాము, మధుకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి విశేష స్పందన



కురవి: ఏడీఈకి ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుడు

కురవి: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కురవి సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, బయ్యారం, తదితర మండలాల్లో విద్యుత్ వినియోగదారుల నుంచి 18 సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు ఏడీఈ రమేష్ తెలిపారు. కురవిలో 7 ఫిర్యాదులు, మిగిలిన మండలాల్లో 11 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏడీఈ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శారద పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో వినియోగదారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని మండల విద్యుత్ శాఖ అధికారి మంగళంపల్లి ప్రవీణ్ అన్నారు. సోమవారం 33/11 కేవీ పరిధిలోని విద్యుత్ సమస్యలపై వినియోగదారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.

గార్ల: గార్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి విశేష స్పందన లభించింది. మండలం లోని విద్యుత్ వినియోగదారులు వివిధ గ్రామాల నుంచి వచ్చి తమ సమస్యలపై విద్యుత్ ఏఈ మహేంద్రబాబుకు దరఖాస్తు చేసుకున్నారు.

బాలిక కుటుంబానికి అండగా ఉంటాం

మరిపెడ రూరల్: గిరిజన బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. మండలంలోని లక్ష్మాతండా గ్రామానికి చెందిన ఓ గిరిజన కుటుంబం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి మియాపూర్ నడిగడ్డతండాలో జీవనం సాగిస్తున్నారు. ఈ కుటుంబంలోని బాలిక దుండగుల చేతిలో అత్యాచారం, హత్యకు గురికాగా, బాధిత కుటుంబాన్ని ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్‌తో కలిసి మంత్రి సోమవారం పరామర్శించారు. ముందుగా బాలిక చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున బాలిక కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూకల నరేష్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి, ఎంపీడీఓ రేవతి, సీడీపీఓ శిరీష, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

గూడూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇరువురి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి దనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మట్టెవాడ శివారు కొంగరగిద్దకు చెందిన కానిస్టేబుల్ ధనసరి పాపారావు, మచ్చర్లకు చెందిన చుంచ దేవేందర్ కుటుంబాలను సోమవారం మంత్రి పరామర్శించారు. కుటుంబాలకు అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చలపతిరావు, సీఐ బాబూరావు, తహసీల్దార్ స్వేత, ఎంపీడీఓ వీరస్వామి పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఇళ్ల మధ్యలో మురుగు గుంత

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు గుంతలు ఏర్పడ్డాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీటితో గుంతలు ఏర్పడటంతో తీవ్ర దుర్గంధం, దోమలు, ఈగలు బెడద పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద గుంతలు ఏర్పడి నిండుగా మురుగునీరు చేరడంతో పశువులు, పందులు, కుక్కలకు గుంతలు ఈత కొలనులుగా మారుతున్నాయి.



గేదెలకు ఆవాసంగా మారిన మురుగు గుంత

విద్యుదాఘాతంతో జీవాల మృతి



మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో రెండు జీవాలు మృత్యువాతపడిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోటిబండ తండా గ్రామానికి చెందిన అంగోతు వెంకన్న ఆవు, జంగిలిగొండ గ్రామానికి చెందిన జక్క సతీష్ ఎద్దు ఊరి శివారులో మేతకు వెళ్లాయి. అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను జీవాలు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.1.40లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.